హామీలను నెరవేర్చాలి

పొలాల్లో ఉరితాళ్ల నమూనాతో నిరసన

ఆదిలాబాద్ జిల్లా ముక్రా(కే)లో ఘటన

ఆదిలాబాద్, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే) రైతులు శనివారం పొలాల్లో తాళ్లు పట్టుకుని ఉరి నమూనాలతో నిరసన తెలిపారు. మాజీ ఎంపీటీసీ సుభాష్ మాట్లాడుతూ.. రైతు భరోసా రాకపోవడంతోపాటు గ్రామంలో 50 శాతం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో రైతులందరికీ రుణమాఫీ చేశామని అబద్ధాలు మాట్లాడుతున్నారని, ఒకసారి తమ గ్రామానికి వచ్చి చూస్తే పరిస్థితి అర్థమవుతుందన్నారు.

లోకం పోకడ

లోపల ఆయన పదవికే భరోసాలేదని బాధపడుతుంటే మధ్యలో మీ భరోసా లొల్లి ఏందయ్యా?!

ఉరికొయ్యలు.. చెరసాలలు!

- ఇందిరమ్మ రాజ్యంలో రైతులకు మిగిలిందివే!
- కాంగ్రెస్ పాలనలో అన్నదాతల ఆక్రందనలు
- ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనకుండా అరిగోస పెడుతున్న సర్కార్
- బోనస్ దేవుడెరుగు.. ధాన్యం కొనే దిక్కేలేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ రాజ్యంలో రైతన్నకు ఉరికొయ్యలు, చెరసాలలే మిగిలాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎక్కడ చూసినా అన్నదాతల ఆక్రందనలే కనిపిస్తున్నాయని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన వాపోయారు. ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న రైతుల ఫొటోలను జత చేస్తూ ట్వీట్ చేశారు. జాతీయ రైతు దినోత్సవం రోజున ఇలాంటి దుస్థితిని చూడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే కొనుగోలు చేయకుండా ప్రభుత్వం అన్నదాతలను అరిగోస పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారం కోసం అడ్డగోలు హామీలు, అధికారం దక్కిన తర్వాత అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ దేవుడెరుగు.. కనీసం మార్కెట్‌కు వచ్చిన ధాన్యాన్ని కొనే దిక్కులేదు అని ధ్వజమెత్తారు. 'రుణమాఫీ కాదు.. రైతు భరోసా రాదు.. అప్పులు తెచ్చి తిప్పలు.. కొనుగోళ్లకు పాతర, దళారుల జాతర' అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. తెలంగాణలో ఏ రైతు బిడ్డా ధైర్యం కోల్పోవద్దని, పోరాటాలు మనకు కొత్తేం కాదని, కాంగ్రెస్ కుట్రలపై కలిసికట్టుగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

భరతరత్న పీవీ.. తెలంగాణ లీవీ

భారతదేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెలంగాణలో పుట్టడం మనందరికీ గర్వకారణమని కేటీఆర్ కొనియాడారు. పీవీ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. గడ్డు కాలంలో దేశానికి ప్రధానిగా సేవలందించిన పీవీ, ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని కాపాడి తన పాలనతో ఆధునిక భారతానికి బాటలు వేశారని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత పీవీ నరసింహారావును బీఆర్ఎస్ ప్రభుత్వం సముచితంగా గౌరవించిందని వెల్లడించారు. పీవీ శత జయంతి ఉత్సవాలను కేసీఆర్ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందని, నెక్లెస్ రోడ్డుకు పీవీ మార్గ్ అని పేరు పెట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని, వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టడమే కాకుండా భారతరత్న ఇవ్వాలని కేంద్రానికి తీర్మానం పంపిందని, పీవీ కూతురును ఎమ్మెల్సీగా నియమించి గౌరవించిందని గుర్తుచేశారు.

తెలంగాణ కొంగు బంగారం సింగరేణి

సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి కుటుంబ సభ్యులకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోనే మొదటి ప్రభుత్వ రంగ సంస్థగా పేరుగాంచిన సింగరేణి వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించిందని పేర్కొన్నారు. దేశ విద్యుత్తు అవసరాలను తీర్చడంలో మూల స్తంభంగా నిలిచిందని కొనియాడారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన సింగరేణి.. బొగ్గు ఉత్పత్తిలో ఏటా సరికొత్త రికార్డులు సృష్టిస్తూ కార్మికుల పాలిట కల్పవల్లిగా, తెలంగాణకు కొంగుబంగారంగా మారిందని తెలిపారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తే బీఆర్ఎస్ తరపున వ్యతిరేకిస్తామని, కార్మికులకు అండగా నిలుస్తామని స్పష్టంచేశారు.

మొదటిపేజీ తరువాయి...

ప్రజాధనాన్ని వృథా చేసిందంటూ ముఖ్య మంత్రి, మంత్రులు బీఆర్ఎస్‌పై ఒక పథకం ప్రకారం తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేశారు. ఎన్నికల ముందు ఇదే రకమైన ప్రచారం చేసిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిని మరింత ఎక్కువ చేసింది. అయితే, ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా తాము చేసింది తప్పుడు ప్రచారమేనని ప్రభుత్వమే అంగీకరించింది. ఇన్నాళ్లు రాళ్లు, రప్పలు, కొండలకు రైతుబంధు ఇచ్చారంటూ ఆరోపించిన కాంగ్రెస్.. అసెంబ్లీలో మాత్రం సాగుకు అనుకూలంగా ఉన్నప్పటికీ యాసంగిలో పంటలు సాగు చేయని భూములకు ఇచ్చినట్టుగా పేర్కొన్నది. తద్వారా రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలు అంటూ తాము చేసిందంతా తప్పుడు ప్రచారమేనని అంగీకరించినట్టయ్యింది. నిజానికి, వానకాలంలో సాగు నీళ్ల వసతి ఎక్కువగా ఉండటంతో పంటల సాగు విస్తీర్ణం కూడా ఎక్కువగానే ఉంటుంది. యాసంగిలో నీళ్ల వసతి తక్కువగా ఉండటంతో తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగవుతాయి. ఈ వాస్తవాన్ని గుర్తించిన బీఆర్ఎస్ సర్కార్.. సీజన్‌తో సంబంధం లేకుండా పంటల సాగుకు అనుకూలమైన భూములన్నింటికీ రైతుబంధు అందించి రైతులకు అండగా నిలిచింది. ఈ వాస్తవాన్ని విస్మరించి కాంగ్రెస్ విష ప్రచారం చేసింది.

యాసంగిలో కోత.. మంత్రి లెక్కలే సాక్ష్యం

యాసంగిలో భారీ మొత్తంలో భూములకు రైతు భరోసా ఎగనామం పెట్టడం ఖాయంగా కనిపిస్తున్నది. శాసనసభలో మంత్రి తుమ్మల చెప్పిన లెక్క ప్రకారం.. 2022-23లో బీఆర్ఎస్ ప్రభుత్వం 294.88 లక్షల ఎకరాలకు రూ.14,743 కోట్ల రైతు బంధు పంపిణీ చేసింది. అయితే, ఆ ఏడాది 206.76 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయని, 88.12 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాకపోయినా రూ.4,406 కోట్లు రైతులకు ఇచ్చారని పేర్కొన్నారు. ఆ ఏడాది వానకాలంలో 135 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, యాసంగిలో 72 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. వానకాలం, యాసంగి సాగు విస్తీర్ణం కలిపితే 207 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ లెక్కన వానకాలంతో పోల్చితే యాసంగిలో తగ్గిన 63 లక్షల ఎకరాలతోపాటు అదనంగా 15 లక్షల ఎకరాల్లో సాగైన ఉద్యాన పంటలను జాబితా నుంచి తొలగించి మొత్తం 88 లక్షల ఎకరాలు సాగులో లేనట్టుగా కాంగ్రెస్ సర్కార్ పేర్కొనడం గమనార్హం.

పత్తి, కంది, సోయా రైతులకు రైతుభరోసా రాదా?

అసెంబ్లీలో మంత్రి ఇచ్చిన నివేదిక ప్రకారం.. యాసంగిలో పంటలు వేయని భూములను కాంగ్రెస్ ప్రభుత్వం సాగు జాబితా నుంచి తొలగించింది. ఈ విధంగా ఏటా సుమారు కోటి ఎకరాల వరకు కోతపెట్టింది. వాస్తవానికి వానకాలం సీజన్‌లో పత్తి సుమారు 50 లక్షల ఎకరాల్లో, కంది, మొక్కజొన్న, సోయాబీన్ 5 లక్షల ఎకరాల చొప్పున సాగవుతాయి. పెసర, జొన్న, మిల్లెట్స్ పంటలు కూడా భారీగానే సాగవుతాయి. ఈ పంటలను తిరిగి యాసంగిలో సాగు చేయరు. వరి సాగు కూడా 10-15 లక్షల ఎకరాలు తగ్గుతుంది. దీంతో వానకాలంతో పోల్చితే యాసంగిలో సుమారు 75-80 లక్షలకుపైగా ఎకరాల్లో పంటల సాగు తగ్గుతుంది. ఈ విధంగా తగ్గిన పంటల సాగు విస్తీర్ణాన్ని సాగు భూమి జాబితా నుంచి ప్రభుత్వం తొలగిస్తున్నది. ఈ నేపథ్యంలో పత్తి, కంది, మొక్కజొన్న, సోయాబీన్‌తోపాటు నీళ్ల కొరత కారణంగా వరి సాగు చేయలేని రైతులకు యాసంగిలో రైతుభరోసా రాదనే ప్రచారం జరుగుతున్నది. ఇదే నిజమైతే, ఆయా రైతులంతా తీవ్రంగా నష్టపోవడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2022-23లో 88.12 లక్షల ఎకరాలకు, 2023-24లో 97.51 లక్షల ఎకరాలకు సాగులో లేకపోయినప్పటికీ రైతుబంధు ఇచ్చినట్టు మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అయితే, ఇవన్నీ కూడా వానకాలంలో పంటలు సాగై.. యాసంగిలో నీళ్ల వసతి లేక పోవడంతో సాగు చేయలేకపోయిన భూములే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా అమలులో భాగంగా యాసంగిలో ఏకంగా కోటి ఎకరాలకు కోత పెట్టడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రెండు సీజన్లకు బీఆర్ఎస్ ఇచ్చిన రైతుబంధు, రెండు సీజన్లలో సాగైన భూమి, యాసంగిలో సాగుకాని భూమి లెక్కలు... (లక్షల ఎకరాల్లో)

సంవత్సరం	రైతుబంధు ఇచ్చిన విస్తీర్ణం	రెండు సీజన్లలో సాగైన భూమి	సాగుకాని భూమి (యాసంగిలో)
2019-20	210.64	141.71	68.93
2020-21	293.13	204.63	88.50
2021-22	295.47	212.86	82.61
2022-23	294.88	206.76	88.12
2023-24	305.00	207.49	97.51

రైతులపై రేవంత్‌ది రెండు నాల్కల ధోరణి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతుల భూములను వేలం వేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఎన్నికల ముందు ఓ మాట.. గెలిచాక మరో మాట మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారని ఎక్స్ వేదికగా ఆరోపించారు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలోని మైలారం, దుర్కి, నస్రుల్లాబాద్, మిర్జాపూర్, నాచుపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతుల భూములను వేలం వేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రుణాలు మాఫీ చేసి అన్నదాతకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం, డబ్బులు కట్టాలని అంకోల్ తండాలో రైతులపై ఒత్తిడి తీసుకురావడం, బలవంతంగా భూముల వేలానికి ప్రయత్నించడం నియంతృత్వ పాలనను తలపిస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో అంకోల్ తండా ప్రజలను ఆదుకుంటానని నమ్మించి, ఇప్పుడు అప్పు చెల్లించాలని వేధించడం, రైతులకు రేవంత్ రెడ్డి సర్కారు చేస్తున్న నమ్మక ద్రోహానికి నిదర్శనమని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజన్న కోడెల విక్రయం నిజం

66 కోడెల్లో 28 అమ్మేశారు

ఎవరికి అమ్మారని అడిగితే చెప్పడం లేదు

వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ వెల్లడి

గీసుగొండ, డిసెంబర్ 23 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి కోడెలను కబేళాలకు విక్రయించిన నిందితులు పోలీసులకు సహకరిచడంలేదని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. కోడెల విక్రయ నిందితులు మాదాసి రాంబాబు, మంద స్వామి, పసునూటి శ్యామ్ సుందర్‌ను కస్టడీలో రెండు రోజులుగా పోలీసులు పలు కోణాల్లో ప్రశ్నించారు. సోమవారం వరంగల్ జిల్లా గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ విచారించారు. మనుగొండ, అనంతారం, చలపర్తి గ్రామాలకు చెందిన 33 మంది రైతుల ఆధార్‌కార్డు, భూమి పట్టాదారు పాసుపుస్తకాలను వేముల వాడ రాజన్న గోశాల అధికారులకు చూపించి రెండు ధపాలుగా 66 కోడెలను తీసుకొచ్చామని, వాటిలో 28 కోడెలను అమ్ముకున్నామని నిందితులు తెలిపారు. ఎవరికి అమ్మినామనే విషయం తెలుపలేదు. గీసుగొండ సీఐ మహేందర్ నిందితుడు మాదాసి రాంబాబును మనుగొండ గ్రామంలోని ఆయన ఇంటికి తీసుకెళ్లి రాజేశ్వరస్వామి సొసైటీకి సంబంధించిన పత్రాలతో పాటు రైతుల ఆధార్‌కార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు, కోడెల వ్యవహారానికి సంబంధించిన పలు పత్రాలను సీజ్ చేశారు. కస్టడీలో తమను కొట్టినా, బెదిరించినా జడ్జి ముందు చెప్తామని పోలీసులకు ఎదురుతిరిగినట్టు తెలుస్తోంది. మరింత సమాచారం కోసం అవసరమైతే మళ్లీ కోర్టు ద్వారా కస్టడీకి తీసుకునే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. వరంగల్ జడ్జి ముందు హాజరు పరిచామని, వారి ఆదేశాలతో ఖమ్మం జైలుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

కమలం కకావికలం!

ఎవరికి వారే.. యమునా తీరే అన్న చందం

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): కమలం కకావికలమైనట్టు కనిపిస్తున్నది. రాష్ట్ర అధ్యక్షుడు మొదలు ముఖ్య నేతలంతా సైలెంట్ కావడంతో దిశానిర్దేశనం చేసేవారు కరువైనట్టు తెలుస్తున్నది. కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి అయిన తర్వాత పార్టీపై పెద్దగా దృష్టిసారించడం లేదని పార్టీ నాయకులే చెప్తున్నారు. మొక్కుబడిగా సమీక్షలు తప్ప, కార్యాచరణ రూపొందించి అమలు చేయడంలో విఫలమవుతున్నారని పేర్కొంటున్నారు. సంక్రాంతి తర్వాత పార్టీకి కొత్త అధ్యక్షుడు వస్తాడనే ప్రచారం నేపథ్యంలో నేతలు సైతం ఆయన ఆదేశాలను సీరియస్‌గా తీసుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. పేరుకే ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నా.. వారి మధ్య సమన్వయం లేదని చెప్పుకుంటున్నారు. తమకే పేరు రావాలని.. ఎవరికి వారే పోటీ పడుతున్నట్టు విమర్శిస్తున్నారు. అందరూ రాష్ట్ర నేతలమని చెప్పుకుంటారని, బండి సంజయ్ మినహా మిగతా నేతలెవరూ ప్రభుత్వంపై విమర్శలు చేయడం లేదని, అందరూ తమ నియోజకవర్గాలకే పరిమితమయ్యారని చెప్తున్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విషయం పార్టీ పెద్దలకు తెలియదని సమాచారం. నవోదయ పాఠశాలల మంజూరు నేపథ్యంలో కలిసినట్టు చెప్తున్నా.. దాని వెనుక ఉద్దేశం వేరే ఉందనే ప్రచారం ఉన్నది. అర్వింద్‌ను కొన్నాళ్లుగా పార్టీలో పక్కనబెట్టి నిజామాబాద్‌కే పరిమితం చేశారు. ఈ నేపథ్యంలోనే పార్టీ పెద్దలకు జలక్ ఇచ్చేందుకు సీఎంను కలిశారనే ప్రచారం జరుగుతున్నది. ఇక ఎమ్మెల్యేల్లో రాజాసింగ్ ఎప్పటి నుంచో దూరంగా ఉంటుండగా.. మిగతా ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరు మినహా మిగతా వాళ్లంతా 'ఎవరికి వారే' అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని చెప్పుకుంటున్నారు. ఈ సమయంలో ఇక నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా.. ఇప్పటి వరకు బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి ఏ ఒక్క కార్యక్రమాన్ని చేపట్టలేదని గుర్తుచేస్తున్నారు. నేతలు ప్రెస్‌మీట్లకే పరిమితమవుతున్నారని విమర్శిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలకు ఎలా సన్నద్ధమవుతారని ప్రశ్నిస్తున్నారు.

మాకు రుణమాఫీ కాలే

- 2500 రాలే.. తులం బంగారం ఇయ్యలే
- నోరెత్తితే కేసులు పెడుతున్నరు
- మాజీమంత్రి సబిత ఎదుట రైతుల మొర
- తుమ్మలూరులో రోడ్డు పనులు పరిశీలించిన సబిత

బడంగ్‌పేట, డిసెంబర్ 23: మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు ఆర్‌అండ్‌బీ రోడ్డును సోమవారం పరిశీలించేందుకు వెళ్లిన మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డితో రైతులు తమ కష్టాలు ఏకరవు పెట్టారు. పథకాల విషయంలో మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇస్తానన్న తులం బంగారం ఊసు లేదని, మహిళలకు రూ. 2,500 లేదని, తమకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని చెప్పుకొచ్చారు. నోరెత్తితే కేసులు పెడుతున్నారని, రెండు పంటల పైసలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు అన్ని రకాలుగా మంచిగ చేసిండని, ఇప్పుడు ఒక్క పని కూడా అయితలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వారి ప్రశ్నలు విన్న సబిత రైతులను ఓదార్చారు. అందరికీ రుణమాఫీ చేశామని అసెంబ్లీలోనే ముఖ్యమంత్రి చెప్పారని, కానీ రైతులేమో ఇప్పటికీ తమకు మాఫీ కాలేదని చెప్తున్నారని పేర్కొన్నారు. రైతు బంధు ఇవ్వలేదు, తులం బంగారం ఎక్కడి నుంచి ఇస్తారని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ హయాంలోనే తుమ్మలూరు రోడ్డు

తుమ్మలూరు రోడ్డును పరిశీలించిన సబిత అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ హయాంలోనే తుమ్మలూరు గేటు నుంచి మహేశ్వరం వరకు రోడ్డును రూ. 14 కోట్లతో మంజూరు చేసినట్టు గుర్తు చేశారు. ఎన్నికలకు ముందే రోడ్డు పనులు ప్రారంభించామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు నిలిపివేసిందని విమర్శించారు. రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడంతో తుమ్మలూరు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇంకా 70 శాతం పనులు జరగాల్సి ఉందని తెలిపారు. త్వరగా పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ఎత్తు పెరగడంతో మొహబ్బత్‌నగర్ వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారిందని పేర్కొన్నారు. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని అధికారులు సబితకు తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

తుమ్మలూరులో మహిళలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

భూమి పట్టా కోసం ఐదు లక్షలు లంచం

ఏసీబీకి పట్టుబడ్డ సబ్ కలెక్టరేట్ ఏవో, సీనియర్ అసిస్టెంట్

తాండూరు, డిసెంబర్ 23 : భూమి పట్టా కోసం లంచం తీసుకుంటూ వికారాబాద్ జిల్లా తాండూర్ సబ్ కలెక్టర్ (ఆర్డీవో) కార్యాలయ ఏవో, సీనియర్ అసిస్టెంట్ ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దుద్యాల మండల కేంద్రంలోని ల్యాండ్ ఫార్మేషన్ రోడ్డు కోసం నిర్ణయించిన 6 ఎకరాల 26 గుంటల భూమి పట్టా కోసం, భూమి స్వభావాన్ని మార్చడం కోసం ఓ వ్యక్తిని తాండూరు సబ్ కలెక్టర్ (ఆర్డీవో) కార్యాలయ ఏవో దానయ్య, సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావు రూ.5లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తాండూర్‌లోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సదరు వ్యక్తి నుంచి రూ.5లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఏవో, సీనియర్ అసిస్టెంట్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. ఏవో దానయ్య, అసినియర్ అసిస్టెంట్ మాణిక్‌రావును అదుపులోకి తీసుకొన్నారు.

లంచం తీసుకుంటూ దొరికిన ఏవో దానయ్య, సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావు

పాత వీఆర్వోలకు మళ్లీ పిలుపు

మొదటిపేజీ తరువాయి...

నియామకంపైనా దృష్టి పెట్టింది. గతంలో వీఆర్వోలు, వీఆర్ఏలుగా పనిచేసి ఇతర శాఖల్లోకి బదిలీ అయినవారి నుంచి ఆప్షన్లు స్వీకరిస్తున్నది. ఈ మేరకు తాజాగా సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీచేశారు. గూగుల్ ఫామ్స్‌లో వివరాలు నింపాలని, జిల్లాల వారీగా కలెక్టర్లు వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఈ నెల 28వ తేదీలోగా వివరాలు అందజేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) హర్షం వ్యక్తంచేసింది. సంఘం అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, కార్యదర్శి వీ భిక్షం రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త అధికారుల రాకతో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏం పని.. ఎంత జీతం?

గ్రామస్థాయి రెవెన్యూ అధికారులుగా వెళ్లాలో వద్దో తేల్చుకోలేక, పూర్వ వీఆర్ఏలు, వీఆర్వోలు మల్లగుల్లాలు పడుతున్నారు. గతంలో ఉన్న వీఆర్వో వ్యవస్థ రద్దయిన నేపథ్యంలో కొత్త పోస్టుల నియమ నిబంధనలను ప్రభుత్వం ఇంకా వెలువరించలేదు. వెళ్తే ఏ పనిచేయాలి? హోదా, వేతన స్కేలు వంటివి ఇంకా ఖరారు చేయలేదు. దీంతో పాటు వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ రద్దయినప్పటి నుంచి ఇతర శాఖల్లో పనిచేసిన సీనియార్టీని పరిగణనలోకి తీసుకుంటారా? లేదా? అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

'పంచాయతీ'పై సర్కారు మల్లగుల్లాలు

డెడికేషన్ కమిషన్‌కు చట్టబద్ధతపై నీలినీడలు • బీసీలకు 42% రిజర్వేషన్లపై అనుమానాలు

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తేతెలంగాణ): పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతున్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోటా కేటాయింపుపై సందిగ్ధత నెలకొన్నది. ఫిబ్రవరిలోనే పూర్తిచేస్తామని సీఎం, మంత్రులు, పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు చెప్తున్నారు.

సర్కారుకు అందని నివేదిక..

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చింది. కులగణన సర్వే, బీసీ కమిషన్ ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు కేటాయిస్తామని, ప్రత్యేక కమిషన్ అవసరం లేదని మొదట సర్కారు వాదిస్తూ వచ్చింది. ప్రతిపక్షాలు, రాజ్యాంగ నిపుణులు, బీసీ సంఘాల నాయకులు డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయకుండా కోటా ఇవ్వడం సాధ్యంకాదని తేల్చిచెప్పారు. దీంతో నవంబర్ 4న భూసాని వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలో డెడికేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నెలరోజుల్లోనే కమిషన్ నివేదిక సిద్ధం చేయాలని సూచించినప్పటికీ డిసెంబర్ చివరి వారం వచ్చినా అందలేదు.

కోటా మించిపోయే అవకాశం..

రాష్ట్రాలు తమకు నచ్చిన రీతిలో రిజర్వేషన్లు కేటాయిస్తుండంతో సుప్రీంకోర్టు ట్రిపుల్ టీ మార్గదర్శకాలు విడుదల చేసింది. బీసీ రిజర్వేషన్లకు డెడికేషన్ ఏర్పాటుచేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాల రిజర్వేషన్ల కోటా 50 శాతం మించరాదని నిర్దేశించింది. దీని ప్రకారం బీసీలకు 42 శాతం కోటా కేటాయిస్తే ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను కలుపుకొంటే 64 శాతం మించిపోయే అవకాశం ఉంటుంది. రాజ్యాంగం ప్రకారం జనాభా, కులగణన చేపట్టే అధికారం కేంద్రానికి మాత్రమే ఉంటుంది. ఒకవేళ ఏదేని రాష్ట్రంలో నిర్వహించాలంటే కేంద్రం నియమించే నోడల్ అధికారి నేతృత్వంలో ఈ ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుంది.

కారోబార్ వ్యవస్థను కొనసాగించాలి

కారోబార్, బిల్ కలెక్టర్స్ ఉద్యోగుల సంఘం డిమాండ్

హిమాయత్‌నగర్, డిసెంబర్ 23: రాష్ట్రంలోని కారోబార్, బిల్ కలెక్టర్ వ్యవస్థను యథావిధిగా కొనసాగించాలని గ్రామంపంచాయతీ కారోబార్, బిల్‌కలెక్టర్ల ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జీవో-51తో ప్రవేశపెట్టిన మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హిమాయత్‌నగర్‌లోని తెలంగాణ పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్ మునావార్, అధ్యక్షుడు యజ్ఞనారాయణ, ప్రధాన కార్యదర్శి ఆర్‌కే నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 12,687 గ్రామపంచాయతీల్లో సుమారు 5,500 మంది మాత్రమే పనిచేస్తుండడంతో పని భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత, బడుగుబలహీన వర్గాలకు చెందిన వారే అధిక శాతం కారోబార్, బిల్ కలెక్టర్స్‌గా పనిచేస్తున్నారని, తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ గ్రాంటుతోనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు భూమన్న యాదవ్, ఉపాధ్యక్షుడు సదానందం, నేతలు యాదగిరి, యాకుబ్ బాషా, చెన్నారావు, కిషన్‌రావు, రఘు, వెంకటయ్య పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లోని తెలంగాణ పంచాయితీరాజ్ కమిషనర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సంఘం నేతలు

నాగర్‌కర్నూల్ జ